

# బంతి

కథ

భమిడిపాటి జగన్నాథరావు

రంగారావు చిరాగ్గా, విసుగ్గా తన ఇంటి 'బెల్' నొక్కేడు. ఓ నిముషంలో ఆయన భార్య సీత తలుపు తీసింది. కాస్త మాసిన చీర. నుదురంతా చెమట. మొహంలో అలసట.

"తలుపు చప్పున తీసి తగలడచ్చుగా- ఏ రాచకార్యం చక్క దిద్దుతున్నావని ఈ ఆలస్యం? ఈ బరువుతో బుజం లాగేస్తోంది" అని బజారునుంచి తెచ్చిన వెచ్చాల సంచి నేలమీదకు విసిరి కుర్చీలో కూలబడ్డాడు. ఆవిడ 'ఫేన్' వేసి వెళ్లి మంచినీళ్ల గ్లాసు అందించింది. గడగడా తాగేసి "ఓ కాఫీ చుక్క నా నోట్లో పోయడం లాటిది ఏదైనా వుందా?" అని అరిచినట్టుగా కసిరేడు.

వంటింట్లోంచి కమ్మటి, ఘాటు వాసనలు బయటకు వస్తున్నాయి.

"కాఫీ ఏదీ?" అని మళ్లా అరిచేడు.

"ఇదుగో- ఈ పోపు కోసం ఆగేను. వస్తున్నా" అని ఆవిడ హడావిడిగా వచ్చి కాఫీ గ్లాసు అందించింది.

ఓ అరగంటకు ఆవిడ "భోజనానికి తేవొచ్చు" అంది.

భోజనం చేస్తూ రంగారావు "కూరలో పోపు మాడి చచ్చిందేం?" అన్నాడు.

ఆవిడ ఏం మాట్లాడలేదు.

చెవుడు కూడా వస్తోందా?"

రంగారావు పెరుగు అన్నంలో ఉండగా "మీ బావగారు ఫోన్ చేసేరు మీరు బయటకు వెళ్లినప్పుడు" అంది సీత.

"ఏం అంటాడు?"

"మా ఆడపడుచు నిర్మలకు వంట్లో బాగులేదుట. రోజూ జ్వరంట. వీలుచేసుకుని ఓ నెల్లాళ్లు సాయానికి రమ్మన్నారు. నిర్మల అందరికీ చేయడమేకాని, ఏనాడూ ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. మీ బావగారూ అంతేకదా. కష్టంలో ఉన్నవాళ్లకి సాయానికి వెళ్లడం అందరికీ మంచిదే" అని ఊరుకుంది.

"నీకు ఢిల్లీ వెళ్లి అవన్నీ తిరగాలని వుందనుకుంటాను. అంత దూరం ఎవడు పోతాడు? పైగా బోల్డంత కర్చు. అమెరికాలో వాళ్ల ఇద్దరు కూతుళ్లు ఉన్నారుగా- ఒకళ్లని పిలవొచ్చుగా. తగుదునమ్మా అంటూ ఇది అమెరికా ఇద్దరి ఆడపిల్లల పురుళ్లకీ వెళ్లిందిగా"

"ఆడపిల్లలు- వయసు మళ్లిన అమ్మల సాయం తీసుకుంటారుకాని, అమ్మల సాయానికి రాలేకపోతున్నారనుకుంటాను. నేను వెళ్లి నిర్మలకు సాయంగా ఉండాలని వుంది"

"ఈ మార్చి ఎండల్లో ఢిల్లీ ప్రయాణం కష్టం. కర్చుకూడా ఎక్కువ. వొద్దులే. దాని సంగతేదో అదీ, బావా చూసుకుంటారులే."

"మీ బావగారు రిటైరయిన ఆఫీసు బ్రాంచి ఈ ఊళ్లో ఉందిట. మనం ఒప్పుకుంటే ఇక్కడి ఆఫీసర్‌తో చెప్పి మనకు టిక్కట్లు ఏర్పాటు చేస్తామన్నారు" అని ఊరుకుంది.

"అలాగా?!"

ఆ రాత్రి సుబ్బారావు ఢిల్లీ నుండి రంగారావుతో మాట్లాడేరు.

నాలుగోరోజున 'జి.టి.'లో ప్రయాణం. 'ఏ.సి' టిక్కట్లు. కాస్త హాయిగా ఉందని రంగారావు చల్లబడ్డాడు.

నిజాముద్దీన్‌కు సుబ్బారావు వచ్చి, తన కారులో ఇంటికి తీసుకెళ్లాడు.

ఆడపడుచు నిర్మలను చూస్తూనే 'చాలా చిక్కిపోయావ్ నిమ్మీ' అని దగ్గరకు తీసుకుంది కళ్లనీళ్లు పెట్టుకుని సీత.

పెద్ద ఎపార్ట్‌మెంట్. కిందనే ఉంది. చాలా సౌకర్యంగా ఉంది రంగారావుకి.

మర్రోజు నుండీ సీత పనిలోకి దిగిపోయి, నిర్మలను కూచోబెట్టి అన్నీ అందించింది. సుబ్బారావు నిర్మలను తీసుకెళ్లి అన్నిరకాల పరీక్షలూ చేయించి తీసుకొచ్చాడు.

'యూరినరీ ఇన్‌ఫెక్షన్.'

పదిహేను రోజులు ఆస్పత్రిలో ఉంచి, వైద్యం చేసారు. మొదటి రోజు మాత్రం రంగారావు బావతో కలిసి అతని కారులో ఆస్పత్రికెళ్లాడు. మర్రోజు నుండి సీత వెళ్లేది సుబ్బారావుతో. రంగారావు 'కూలర్' ఆన్ చేసుకుని చల్లగా ఇంటిపట్టునే ఉండి, విశ్రాంతిగా ఉన్నాడు.

ఓరోజు "ఏంతోచడంలేదయ్యా, మీరిద్దరూ ఆస్పత్రిలోనే ఉంటున్నారుగా" అన్నాడు సుబ్బారావుతో.

మర్రోజు సుబ్బారావు అయిదురోజులు చూడవలసిన చోట్లకు వెళ్లి రావడానికి టూరిస్ట్ బస్ టిక్కెట్టు ఇచ్చాడు రంగారావుకు. ఏ.సి. కోచ్‌లో తాజ్‌మహల్, ఫతేపూర్ సిక్రీ, జైపూర్, ఉదయపూర్ చూసి సుఖంగా తిరిగొచ్చాడు రంగారావు.

వచ్చిన రాత్రి "నోరు కాయ కాసిపోయిందే ఆ రొట్టెల కూడు తిని. ఆ తిండి బలంగా ఉన్నా, మన రుచులుండవుగా! వంకాయ మషాలావేసి వండవే సీతా" అని ఆజ్ఞ జారీచేసేడు.

ఆరోగ్యం కుదుటబడటంతో నిర్మల ఇంటికి వచ్చేసింది.

'నీ సాయం, ప్రేమ, ఆప్యాయతతో నేను బాగా అయ్యాను వదినా' అని సీతను దగ్గరకు తీసుకొంది. నీ ఆడపిల్లలిద్దరూ అమెరికాలో బాగా ఉన్నారుగా. ఓ నెల్లాళ్లు వచ్చి నీకు సాయంగా ఉండమనవే నిమ్మీ" అన్నాడు రంగారావు నిర్మలతో. "వాళ్లెక్కడరాగలరన్నయ్యా. వాళ్ల తాపత్రయాలు వాళ్లవి. అబ్బాయి కొత్త ఉద్యోగంలో జేరేడుట. కోడలు 'ఎమ్.ఎస్'లో జేరిందట. ఆమే రాలేదు."

"అవున్లేవే. మా ఇద్దరి అబ్బాయిలు దేశంలోనే ఉన్నా మా దగ్గరకు

వాళ్లూ రారు. వాళ్ల అవసరాలకు మాత్రం మనం పోవాలి. ఏవిటో? దగ్గరవాళ్లే దూరం అయిపోతున్నారు. కాలం. కలికాలం" అని రంగారావు మెట్ట వేదాంతంలాటిది వల్లించేడు.

ఆ తరువాత సీత ఇంకో పదిహేనురోజులు ఆడపడుచుకు అండగా ఉండి, ఆమె పూర్తి ఆరోగ్యంతో ఉన్నాక "ఇక మేం వెళ్తాం" అంది.

నిర్మల ఓరోజు సీతకు కుతుబ్‌మీనార్, లక్ష్మీ నారాయణ ఆలయం, ఇండియాగేట్ అన్నీ చూపించింది. నలుగురూ రెండుపూటలూ హోటల్లో భోంచేసారు.

సీత, రంగారావు ఏభైరోజుల తర్వాత వెనక్కు వచ్చారు.

పదిరోజుల తర్వాత రంగారావు బయటకు వెళ్లి ఇంటికొచ్చి దగ్గరగా ఉన్న వీధి తలుపుతీసి లోపలకొచ్చి, చిన్న బల్లమీద వున్న నీళ్లు తీసుకొని తాగుతూ- రెండోగదిలోంచి గలగలా మాటలు, కిలకిలా నవ్వులూ వింటూ, దగ్గరగా మూసి ఉన్న తలుపు కేసి చూస్తున్నాడు.

ఈ పిల్ల ఎక్కడుంటే అక్కడ తన చైతన్యంతో వాతావరణంలోను, చుట్టు ఉన్నవాళ్లలోనూ ఉత్సాహం, హాయి వెదజల్లుతుంది. గలగలా ఉరవడితో ప్రవహించే నదిలాటిది. ఆమె సాన్నిహిత్యంలో చుట్టుపక్కలవాళ్లు కొత్త రక్తం ఎక్కినట్టు మెరుస్తారు.

ఇంతలో ఆ గదిలోంచి ఓ యువతి వచ్చి "బాగా ఉన్నావా బాబాయ్" అంది.

"ఎప్పుడొచ్చేవే మంజూ" అన్నాడు రంగారావు.

"మూడురోజులైంది"

"అయితే ఇప్పుడా రావడం? ఎక్కడుంటున్నావ్?"

"ఓ ముప్పయిరోజులు మా లెక్చరర్స్ కొందరికి 'ఓరియంటేషన్ కోర్సు' ఏర్పాటుచేసేరు. నలభై ఆడ టీచర్స్‌మి వచ్చాం. వాళ్ల ఇచ్చిన హాస్టల్‌లో ఉంటున్నాం అందరం. ఈరోజు మాకు ఓ 'హాఫ్‌డే' ఆఫ్. సో... మీ దగ్గరకు" అంది నిండుగా నవ్వుతూ.

ఈ మంజుల రంగారావు వరసకి తమ్ముడి కూతురు. రంగారావుకు ఆడపిల్లలు లేకపోవడంతో ఈ మంజులంటే ప్రత్యేకమైన ఇష్టం.

"నువ్వు ఇంకా చిన్నపిల్లలా అయిపోయావే- ఏవిటి రహస్యం?" అన్నాడు మురిపెంగ.

"చిన్నపిల్లనేవిటీ? క్రితం నెలలో ముప్పయ్‌అయిదు వెళ్లింది"

ఈ పిల్ల ఎక్కడుంటే అక్కడ తన చైతన్యంతో వాతావరణంలోను, చుట్టు ఉన్నవాళ్లలోనూ ఉత్సాహం, హాయి వెదజల్లుతుంది. గలగలా ఉరవడితో ప్రవహించే నదిలాటిది. ఆమె సాన్నిహిత్యంలో చుట్టుపక్కలవాళ్లు కొత్త రక్తం ఎక్కినట్టు మెరుస్తారు.

"మా దగ్గర ఓ వారం రోజులుండవే మంజూ" అన్నాడు రంగారావు.

"అందరం హాస్టల్‌లో ఉండాలన్నది నిబంధనకదా! వీలైనపుడల్లా వచ్చి వీలయినంత ఎక్కువసేపు గడుపుతాను బాబాయ్?"

"ఈమధ్య నిర్మల దగ్గరకు ఢిల్లీ వెళ్లేం- దానికి వంట్లో బాగాలేకపోతే సాయంకోసం వెళ్లేం"

"అవునటగా- సీత పిన్ని చెప్పింది. అవును ఇప్పుడు ఎక్కడకు వెళ్లేవ్ బాబాయ్"

"బిల్లులు కట్టాలిగా- సమయం దాటిపోతే- ఇంట్లో చీకటి, టెలిఫోన్ మూగదైపోతుంది. ఎండలో చచ్చిచెడి వెళ్లి బిల్లు కట్టుకొచ్చాను. ఇంట్లో సరుకులు కూడా నేనే తేవాలి. అన్నీ నేనే చూసుకోవాలి గదా!" అన్నాడు నిష్ఠూరంగా.

"అవును బాబాయ్- నువ్వు ఉద్యోగంలో ఉండగా నీకిందివాళ్లనంతా గుప్పిట్లో ఉంచుకుని, నీ పనులన్నీ వాళ్లతో చేయించుకునేవాడివని చెప్పుకుంటారు. మరి ఉద్యోగ విరమణ తర్వాత మన పనులు మనవే చేసుకోవాలి గదా! అది నీకు కష్టంగా ఉంది" అంది మంజూ ఆ విషయాన్ని తేలిగ్గా తీసేస్తూ, నవ్వుతూ.

"నీకేం? నన్ను వేళాకోళం చేద్దామని నువ్వు ఎన్నైనా చెబుతావే"

"నేనింకా చెప్పగలను బాబాయ్- పిన్ని నలభై ఏళ్ళుగా వంటింట్లో పొగలో, సెగలో, మంటల్లో మాడిపోతోంది. ఆ శ్రమతో పోలిస్తే నీ శ్రమ ఏపాటిది? పిన్ని ఇప్పుడు నివురుకప్పిన నిప్పులా ఉంది. ఇంకో విషయం చెప్పనా- ఢిల్లీ వెళ్లి నిర్మలత్తకు అన్ని విధాలా సేవచేసి, చిక్కిపోయి, నీరసంగా అయిపోయింది. ఆడవాళ్లకు ఎక్కడున్నా తరగని పనేకదా- నువ్వేమో ఢిల్లీలో ఇంటిపట్టునే ఉండి నున్నగా తయారయ్యావు. అదీ విషయం. ఇంకోసారి ఈ విషయాల గురించి ఆలోచించు. నాలుగురోజుల్లో మళ్లా వచ్చి ఓ రోజంతా మీతోనే వుంటాన్లే!" అని సీతాకోక చిలకలా ఎగిరిపోయింది.

వెలుగు మాసిపోయి చీకట్లు కమ్ముకున్నాయి.

ఆ ఆదివారం మంజుల ఉదయాన్నే వచ్చింది.

టిఫిన్ తిని "నేను ఓ రెండు గంటల్లో వస్తానే అమ్మాయ్. అవసరమైనపని. ఇవాళ ఇక్కడే ఉండు" అని రంగారావు వెళ్లిపోయాడు.


తిరిగి వచ్చి భోజనం చేస్తూ "వంట కొంచెం తేడాగా గమ్మత్తు రుచిగా ఉంది. మంజూ నువ్వు చేసేవా?" అన్నాడు.

"లేదు బాబాయ్. పిన్నిని తీసుకెళ్లి ఓ అనాథపిల్లల శరణాలయానికి వెళ్లాను. భోజనం వండడమెందుకని- ఫర్లాంగు దూరంలో వున్న చిన్న మెస్ నుంచి కేరియర్ తెప్పించేను. పిన్నీ నేను కబుర్లు చెప్పుకుంటూ, పాతవీ కొత్తవీ ఎన్నో నెమరేసుకున్నాం."

రంగారావుకు ఏంమాట్లాడాలో తోచక భార్యకేసి, మంజులకేసి మార్చిమార్చి చూసి తినడంలో 'బిజీ' అయిపోయినట్టు ఉండిపోయేడు.

ఆ రాత్రి మంజులే వంట చేసింది. భోజనాలయాక వెళ్లిపోతూ "వచ్చే శుక్రవారంతో మా నెల్లాళ్ల కోర్సు అయిపోతుంది. శనివారం మీ దగ్గరకు వచ్చి, ఆదివారం రాత్రి రైలెక్కేస్తాను" అంటూ వెళ్లిపోయింది.

శనివారం ఉదయం రంగారావు బైటకు వెళ్లి, మధ్యాహ్నం పన్నెండు



న్నరకు చిరాగ్గా ఇంటికొచ్చేడు. ఇంట్లో మంజుల ఉండడం చూసి ఆయనకు కాస్త తృప్తిగా ఉంది. మంజుల భోజనాలు చేస్తూ "ఇవా ళా మెస్ భోజనవే- తెలిసిందా?" అంది.

"నిజవా?!" అన్నాడు నమ్మలేన ట్టు.

"సినిమాకు వెళ్తున్నాం. సాయం త్రం వస్తాం" అని మధ్యాహ్నం మంజూ, సీత బయటకు వెళ్లిపో యారు.

రాత్రి భోజనానికి రంగారావుని హోటలుకు తీసుకుపోయింది మం జూ. సీత హుషారుగా ఆటోలోకి చురుగ్గా దూరిపోయింది.

ఆ రాత్రి ఇంటికి వచ్చేక రంగా రావుకు తన చుట్టూ వాతావరణం వేడెక్కినట్టు అనిపించి 'ఛ, ఛ- అంతా మామూలుగానే ఉంటుంది' అని తనని తను అనునయించుకు న్నాడు.

ఆదివారం ఉదయం పదిగంట లప్పుడు సీత మొగుడు దగ్గరకొచ్చి "అనాధ పిల్లల శరణాలయంలో వాళ్లకు సాయంగా అక్కడే ఉందా మనుకుంటున్నాను రేపణ్ణించి" అంది.

పక్కనే ఉన్న మంజుకేసి కోపం గా చూస్తూ "ఇది నీ అయిడియా నా?" అన్నాడు.

"లేదు బాబాయ్. నువ్వు క్లబ్బు కెళ్లినప్పుడు సీతపిన్ని వెళ్లి మాట్లా డి వచ్చిందట. అక్కడ కొన్నాళ్లు వుంటుందట."

"అక్కడ వంటమనిషిగానా?" అన్నాడు కసిగా.

"కాదు" అంది సీత

"ఆయాగానా?"

"అదీకాదు"

"మరేం చేస్తావక్కడ?"

"ఆ పిల్లలకు శుచి, శుభ్రం, మంచి అలవాట్లూ అలవాటు చేస్తూ వాళ్లకు దన్నుగా ఉండి వాళ్ల మీద వాళ్లకు నమ్మకం, విశ్వాసం కలిగిస్తాను. రెండువేలు ఇస్తారు."

"మరి... నేనెక్కడ ఉండను?!" అన్నాడు.

"మనింట్లోనే. పనిమనిషి కాఫీ చేసుకోడం నేర్పుతుంది. మెస్‌లో భోంచేయండి" అంది సీత తొణు కు, బెణుకు లేకుండా.

కాసేపు ఆగి "నాకూ కాస్త విశ్రాంతి, విరామం, మనసుకు హాయి కావాలి ఈ వయసులోనై నా" అంది.

రంగారావుని చూస్తూ మంజు "బాబాయ్. పిన్ని ఆరోజుల్లోనే పెళ్లి నాటికే ఇంటర్ పాసయింది. బి.ఏ.కు కట్టానన్నా నీవు కసిరి మానిపించేవుటగా. ఎనిమిదేళ్ల పిన్ని నేర్చుకున్న వీణను 'ఇకచాల్లే సంగీతం' అని అటకెక్కించేసావు. ఇవన్నీ మా అమ్మానాన్న చెప్పారు లే. నీ అహంకారం తగ్గాలి బాబా య్. ఈ వయసులోనైనా మీరి ద్దరూ స్నేహితుల్లా ఉండకూడ దూ?" అంది మంజుల.

"నాకు అహంకారం అంటావా?" అంటూ రంగారావు మంజులకేసి నిప్పులు కురిపిస్తూ చూసేడు.

"ఆ మాట నాదికాదు బాబాయ్. నీతో ఇన్నాళ్లూ కాపురం జేసిన పిన్ని అంది. అనలేమందో వివ రంగా చెప్పనా? 'వీళ్ల నాన్నగారికి- అంటే మా మావగారికి చాదస్తంతో కూడిన అహంకారం. ఈయనది అర్థంలేని అహంకారం. ఇక మా అబ్బాయిది వాడి అహంకారం వాడిది' అంది సీత పిన్ని నాతో నిన్న రాత్రి."

రంగారావుకు తనకింద భూమి బీటలువారి తను ఆ లోతుల్లోకి వెళ్లిపోతున్నట్టు అయి భీతి ఆవహి స్తోంది.

"నేనొక్కణ్ణే ఉండలేనే సీతా! ఈ వయసులో వంటరితనంలో నేను ఎండిపోతాను. ఇద్దరం కలిసే ఉం దాం. శరణాలయానికి వెళ్లిపోవద్దు. ప్లీజ్" అన్నాడు లేచి భార్య చేతులు పట్టుకొని.

"అలా అయితే అలాగేలెండి. ఓ రెండు నెలలు మెస్ నుండి కేరి యర్ తెప్పించుకుందాం. ఈలోపు న మీరు నా దగ్గర వంట నేర్చు కోండి. రెండు నెలల తర్వాత ఇద్దరం కలిసి వండుకుందాం. బైటపనులకి నేనూ వస్తాను. సరే నా?" అంది సీత.

భార్య కంఠంలోంచి ధ్వనిస్తున్న నిబ్బరం చూస్తూ, భార్యకేసి భయంభయంగా చూస్తున్నాడు రంగారావు.

కాసేపటికి తేరుకుని ఏదో అనా లని "చూసావా మంజూ- మీ సీతపిన్ని నాది అహంకారం అం టోందా?" అన్నాడు.

"నీది ఔద్ధత్యం కూడా బాబా య్"

"అదేవిటేవ్- పెద్దమాట వాడే వు. ఔద్ధత్యం అంటే ఏవిటి?" అన్నాడు.

"ఔద్ధత్యం అంటే నువ్వే. ఔద్ధ త్యం కూడిన అహంకారం అంటే అర్థం- మీ జాతి లక్షణం." •



# విశ్వవిశ్వంభర

అరమూసిన కళ్ళముందు
తొణుకుతున్న మధు చషకం
జ్వలించే దీపం చుట్టూ
కబళించే చీకటి మూకలు
తప్పిన మనోజ్ఞ కళాగతులు
ప్రచండ శివతాండవంలో
'అ, ఇ, ఉ, ణ్, ఋ, లు, క్'
ప్రమదుల ఢమరుకాల ఝుణత్కార శబ్దాలు!
కొత్తతరం సృజనలో
'థెక్, డెక్'ల నృత్యహేల
అల్టిమేట్ ఫాంటసీ!!
రెండు పాదాల మార్మిక వ్యధ
కలికాలం గంతలు కట్టినా
గతి తప్పని సప్తాశ్వని గుఱ్ఱాలు
చుట్టలు చుట్టుకున్న చేతగానితనంతో
ఆర్థిక నగరంలో ఆగని విస్ఫోటనలు
దాహంతీరని ఉగ్ర మద మతఖడ్గం!
ఫరిమళ పెస్టిసైడ్స్ శీతలపానీయాలు తాగుతూ
అర్థంకాని అక్షరం చుట్టూ తిరుగుతూ జనం
మనస్సు నిలువునా
శరీరం నిండా నేను!?
పాతాళ భువన సప్తకంలో పలికే నేను
నాలోంచి పలికే నేను
ఎవరీ నేను??
నాలోకి పరికిస్తూ
గాఢ పరిష్వంగంలో సప్తార్చిదీపశిఖలు
ఊహని ఆవాహన చేస్తూ
మూతబడ్డ కళ్ళు విశ్వ విశ్వంభర సాక్షాత్కారం
'పూర్ణస్య పూర్ణమిదం పూర్ణం'
ఇప్పుడు జీవితం
అబ్‌స్ట్రాక్ట్ భావచిత్ర నవమోహన కేళి.

- డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి